# కథలో కథ పిట్టకథ

శ్రీ. దేశరాట్-విరాట్

[ఎంత చిన్న భావాన్నైనా చక్కని టెక్నిక్‌లో ఆకర్షణీయంగా అందివ్వడం దేశరాట్ విరాట్ సొత్తు. ఈ రచన గురించి అంతకన్న ఎక్కువ వ్రాయడం మంచిదికాదు. కథను చదివి ఆనందించండి.]

*

కథలోకథ, పిట్టకథ—

—అనగనగా ఒకరాజు...

ఛుప్ రహో?...

—రాజుకు ఒచ్చిందొక్కటే హిందీ ముక్క. పాతిక సినీమాలు చూడగా, చూడగా చెవులికి స్ఫుటంగా ఇదొక్కటే అన్నిట్లోనూ వ్యత్యాసం ఏమీలేకుండా వినిపించింది. అర్థాన్ని అలా అవతలవుంచు. అది ఎందుకో కంఠతా వచ్చేసింది. ఏం మృదువు?

మరోహటికూడా అతను తరుచూ వింటున్నాడు—కుస్తీ, జబర్దస్తీ సినీమాలలో...అరే, దుష్మన్!

నవకాళీ అల్లరులు కాస్త తగ్గుతున్న సూచన పత్రికలద్వారా కనబడింది. శాంతి యాత్రకు మహాత్ముడు బెంగాల్ పోనున్నాడని తెలిసింది రాజుకు. రాజూ డబ్బా, డవాలా మూటకట్టి నవకాళీపరిస్థితుల్ని పర్యాలోకించి వస్తానని ప్రయాణం సమకట్టాడు. తనతో ఎవరూ రావద్దని పదే పదే హెచ్చరికలిచ్చి, రైలెక్కాడు. మతకలహాల ప్రళయజ్వాలల్లో, మృతకళేబరాల భీభత్సాన్ని కేమెరాకెత్తి తేవడానికి అతని పయనంలో పరమార్థం వుంది. పరమార్థంలో బలే చురుకుదనపుపాళ్లు. కొన్ని కల్పించి అర్థనారీశ్వరుడు అట్టహాసంతో రాజు తన నవకాళీ కేమారామరయాత్రను ప్రారంభించాడు.

ఒకరిద్దరు ఊరిలోని పత్రికలవాళ్లకి కేమరామాన్ రాజా బెంగాల్ ప్రయాణ సరంజామా సంగతి హఠాత్తుగా ఎవరో వచ్చి చెప్పారు. రాజా బయలుదేరక ముందే అతగాడి దగ్గిరికిపోయి, తమకు ప్రత్యేకమైన దృశ్యాల్ని తీసిపెట్టి, పంపించ

మని విన్నవించుకున్నారు, పత్రికాధిపతులు. 'సరే' అన్నట్టు వూగిసలాడింది రాజాతల.

వెళ్ళిన పదోరోజున పత్రికా కార్యాలయాలకి రెండుసీల్డుకవర్లువచ్చాయి రాజా పంపినవి. నవకాళీభీభత్సదృశ్యాలు. ఘోర నరక సన్నివేశాలు.

—ఒకదానిలో:

దట్టమైనపొగలు. ప్రజ్వరిల్లుతున్న అగ్గి కొనలూ; సామిప్యంగా ఓ ఇల్లు, పూరిగుడిసా లేదు. దగ్ధమయివుంటయని వూహించుకోవాలి. ఏవో ఏవో ఆకారాలు క్రింద పడివున్న ఛాయలు. చిత్రం అడుగున ఎర్రక్షరాల్తో 'భీభత్సశ్మశానం' అని రాజా వ్యాఖ్యానం. నిజానికది నిదానించి చూస్తే మండే కుమ్మరావం.

—రెండోదానిలో:-

అంతకన్నా భయానకమైనదృశ్యం. 5 6 గురు' అబలలైన స్త్రీలు పరువెత్తుచున్నట్టుంట్టుంది. కాళ్ళలో పగిలిన కడవట. ఎదురుగా ఈటెలూ, కర్రలూ ధరించిన బలిష్ఠులైన ముస్లిములు. దానికి రాజా 'నవకాళీకాందిశీకులు' అని పేరు పెట్టాడు. కాని వెంటతరుముతున్నది కొవ్వెక్కి పోయిన నల్లగిత్త. ప్రక్కవృక్షచ్ఛాయలో అది లీనమయి కనీకనపడకుండా వుంటుంది.

'లూటీ' అనిమరోచిత్రం పంపించాడు రాజా. ఒకభవనం అరుగుమీదనిల్చుని ఎవళ్లో 'ఆగండి! ఆగండి! అన్నట్టూవుంటుంది. అది మార్కెటులో ఒక రేషను షాపు. గుంపులోనిల్చున్న ఒకాయన చేతిలోని రేషను కార్డు చూస్తే విస్పష్టమవుతుంది.

చిత్రాలన్నీ మరుచటిరోజు పత్రికలలో అచ్చనయ్. చూసిన ప్రజాలోకం కన్నీటిబొట్లు విడిచింది.

పత్రికాధిపులు చిత్రానికి పదిపదులవంతున పారితోషికం పంపించారు రాజాకి.

నవకాళీలో ఒక మూల మహాత్ముడు పర్యటనం సాగిస్తూవుంటే మరొహ మూలనుంచి రాజా కెమెరాయాత్రను మొదలుపెట్టాడు. వెళ్ళినచోటనల్లా శరవేగంతో దృశ్యాలు తీసిపంపిస్తున్నాడు. దృశ్యానికివందా నిరాఘాటంగా మనియార్డరుగా వచ్చి చేరుతున్నది.

తరువాతి రెండు రోజుల్లో రాజా పర్యటనకార్యక్రమం అవతల పత్రికాధిపతులకీ, బంధుమిత్రులకీ కూడా వచ్చిచేరింది.

ఫిబ్రవరి 12—శ్రీరాంపూర్

శ్రీరాంపూర్‌లో రాజా అడుగుపెట్టడం తోనే, అణగిపోయిన అల్లరులు తిరిగీ ప్రారంభమైనయ్. గూండాలు మళ్ళీ చిత్రవధల కుపక్రమించారు. రాజాబసచేసిన ఇంటిముంగిటనే భయంకర మానవహత్య.

స్థలం నిర్మానుష్యమయింది. పిల్లలు, తల్లులు. యువతులు, పెద్దలు, ముసలివాళ్ళు అంతా ఎవరికివారే హిందువులు తలో దిక్కు పారిపోతున్నారు. బంధువులకీ, మిత్రు

లకీ, అనుచరులికీ ఒకరికొకరు దూరమయి పారిపోతోంది ప్రజావాహిని.

రాజా ముళ్లపొదల్లోంచి, కాలవలు దాటి, శక్తికొద్దీపరువెత్తాడు. గూండాలు తరుముకుని వస్తున్నారేమోననేభయంతో వెనుదిరిగి చూడనేలేదు.

దాదాపు మూడుమైళ్ళ మార్గం పరువెత్తి వచ్చినట్టూ అంచనావేసి ఒకచోట నిలవగలిగాడు. గూండాలు ఇంతదూరం పరువెత్తివస్తారా? కాళ్ళుపీకి, వుండిపోతారన్న ధైర్యంతో కళ్ళుమళ్ళించిచూశాడు.

ఎవరో ... ఎవరో...తనదిక్కేవస్తున్నారు!

చప్పున పొదచాటున నక్కి జాగ్రత్తగా పరిశీలించి చూశాడు. ఆమె ఒక స్త్రీ! యువతి కూడానేమో.

ఆమె హఠాత్తుగా వచ్చి పొదచాటున నక్కివున్న రాజానిచూసి, ఉక్కిరి బిక్కిరై నిల్చుండి పోయింది. వణకిపోతోన్నాయి ఆమె లేజివురుపాదాలు.

రాజా ఒకగూండా...అనుకుంటోందేమో—భీతహరిణేక్షణ!

స్త్రీని చూడడమే ధైర్యం పదింతలయింది రాజాకీ. దగ్గిరికిమెల్లిగా అడుగులు వేస్తూ వెళ్ళాడు.

'అమ్మోయ్!' పెద్దకేక వేసింది యువతి.

'అమ్మోయ్!'

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

—ఛుప్ రహో!

'నేను గూండానికాను. భయపడకు. ఏడవకమ్మాయ్!' అన్నాడు రాజా...

'నిన్ను రక్షించేపూచీ నాది. నీప్రాణానికి నాప్రాణం అడ్డు. శ్రీరాంపూర్ దాకా సహాయం వచ్చి దిగబెట్టమంటావా?-మీయింటికి.'

ఆమె వెక్కి వెక్కి మళ్ళీఏడ్చింది.

'ఉహుఁ. అబ్బో! గూండాలకి దొరక్కుండా నిన్ను రక్షిస్తాను. ఏంవచ్చేదేనా?' అడిగాడు రాజారావు.

'అయితే నాతోరా! గూండాలకి దొరక్కుండా నిన్ను రక్షిస్తాను. ఏంవచ్చేదేనా? అడిగాడు రాజారావు.

ఆమె బదులుచెప్పకుండా రాజాని అనుసరించింది.

రాజాహుగ్లీ చేరేసరికి జేబులోనితడి కాస్తా అయిపోయింది. మధ్య. మధ్యయువతికి కావలసిన టిఫినూ, సకలోపచారాలకీ వెంటనేకేమెరా తీసి, మీటనొక్కి ఇట్టే అనిపించాడు. చిత్రంవచ్చి ఊడిపడింది. తాను మాట ఇచ్చిన పత్రికాధిపతికి సీల్డు కవరులో పెట్టి పంపించాడు.

టెలిగ్రాంమనిమార్డరులో వందరూపాయలు రెండోనాటిసాయంత్రానికి వచ్చి జేబు ఖాళీ మళ్లీపూర్తిచేసినాయ్.

పత్రికలో చిత్రంప్రచురింపబడింది-'దాడితరువాత' అన్ననామకరణంతో. దృశ్యం ఇది.

పొలాలగట్లూ, వెనుకతోటలూ, చెట్టుకింద నడవలేక కూర్చుండిపోయిన యువతీ. ఆమెని సేదతీరుస్తున్న యువకుడూ.

ఆయువకుడు ఫోటోగ్రాఫర్ రాజా రావు.

'మీనూ!' పిల్చాడురాజా, యువతిని.

'ఏం?' అనింది మీను.

'నిన్ను రక్షించేశాను. ఇకనాపూచీసరి. నేనిప్పుడే మద్రాసుమెయిలెక్కి, ఆంధ్ర రాష్ట్రం చేరుతున్నా!

'మరినామాటో?' అనింది మీను.

రాజామాటలకి నిర్ఘాంత పోయింది. 'మీరు నన్నిక్కడ విడిచి వెళ్తే నాగతేంకాను. కలకత్తాలో కూడా అల్లరిగానేవుంది. అమ్మయ్యోయ్! చంపేయరు! ఇక్కడ వుంటే గూండాలు ఏంచేసినాచేస్తారు.'

"పోనీ, శ్రీరాంపూర్ దిగబెట్టేస్తా."

'నమస్కారం. అక్కడికి మాత్రం దిగబెట్టకండి. పట్టపగలు ఖూనీ అయిపోతాను'

'అంటే సరాసరి బెంగాల్ నుండేతప్పించమనా—నీఅభిప్రాయం?

'అవును. ఊం...' అంది మీను

'సరే. నాతోరా. ఆంధ్రరాష్ట్రం' అన్నాడురాజా.

మద్రాసు మెయిలు రావడమే మీనూని అందులో ఎక్కించి కూచున్నాడు. మెయిలుకదిలి, ఆంధ్రరాష్ట్రంవంక గంతులేస్తూ బయలుదేరింది.

టికెట్ కలెక్టరు వచ్చి 'ఎవరు మీర'ని అడిగాడు. ఆంధ్రుడవునేమో రాజాని ఆంధ్రుడని గుర్తించి.

'నేను ఆంధ్రా—'అన్నాడు రాజా...

'ఆమె?...'ఆమె ఆకారం ఆంధ్రస్త్రీ లక్షణమల్లె లేదు. బెంగాలీవాసనలు విరజిమ్ముతున్నయి కళ్లు.

'మైవైఫ్' అన్నాడు రాజా.

టికెట్ కలెక్టర్ మరోకంపార్టుమెంటులోకి వెళ్ళిపోయాడు.

'కిం?' అని అడిగిందిమీను.

—ఘుఫ్‌రహో, అన్నాడురాజా...

కధలో కధ పిట్టకధ—


నపుంసకత్వ రోది



నవ యౌవనము. దేదీప్యమాన పటుత్వము చేకూర్చు దివ్యౌషధము. రక్తమును పరిశుభ్ర పరచును. ధాతుపుష్టి కలిగించును. క్షీణించిననరములకు పటుత్వము చేకూర్చి.వివాహితులకుసంతృప్తి ఆనందము కలుగచేయు శక్తివర్ధకము.

వెల సీసా రు. 10

కామ స్తంభన

కామశక్తిని వృద్ధిపరచి, శీఘ్రపతనమును నిలిపి, రతిక్రీడయందు సాటిలేని ఆనందమిచ్చును.

వెల రు. 1-4-0

మదనమంజరి ఫార్మసీ,
184 చైనాబజారు, మద్రాసు.

—: స్టాకిస్టులు :—

నెల్లూరు: ఆర్యన్ ఫార్మసీ, ట్రంకు రోడ్డు.
రాజమండ్రి: ఈశ్వరదాసు అండ్ కో.
బెజవాడ: శ్రీనివాస మెడికల్ స్టోర్స్.
విశాఖపట్టణము: నీలము అండ్ కో.